క్లుప్తంగా

ఆడే గజేందర్‌ను కలిసిన తేజాపూర్ గ్రామస్తులు



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మండలంలోని తేజపూర్ రెడ్డి సంఘం సభ్యులు, గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి ఫంక్షన్ హాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. స్పందించిన ఆడే గజేందర్ మాట్లాడుతూ వెంటనే పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఇచ్చోడ: గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని వీడీసీ అధ్యక్షుడు పెరమండ్ల నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వీడీసీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాభివృద్ధికి వీడీసీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీడీసీలో ఉన్న బాధ్యులే కాకుండా గ్రామస్తులు, గ్రామ పెద్దలు సైతం సహకరించి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి రేనికుంట సురేశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పాఠశాలకు చేయూత



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం బ్రహ్మణ్‌వాడలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులకు శ్రీషిర్డీ సాయి సేవా సొసైటీ అండగా నిలిచింది. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో అక్కడ చదువుతున్న 50 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు పడుకునే హాస్టల్ గదుల కిటికిలకు ఫైబర్ చద్దర్‌తో లోపలకు గాలి వెళ్లకుండా ఫ్రేంలను తయారు చేయించారు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు నాలం అనిల్ కుమార్, అధికార ప్రతినిధి సురేశ్, సంస్థ మేనేజర్ పసుపుల రాజు, శ్రీకాంత్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

బోథ్: బోథ్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర రావును కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం వేర్వేరుగా శాలువాతో ఘనంగా సత్కరించారు. స్థానిక స్థితిగతులపై చర్చించారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని అణివేయాలని కోరారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, సురేందర్, బొడ్డు శ్రీనివాస్, ప్రశాంత్, స్వామి, రజియా బేగం, మహేందర్ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన కొట్టూరి రాజు తల్లి ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పొచ్చెర గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు విలాస్ రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, సురేశ్, విజయ్, రాకేశ్, రూప్‌చంద్, రవి పాల్గొన్నారు.

కాలిపోయిన పత్తి పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్‌చందర్

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన బండారి కమలాకర్ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల పత్తి ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా బుధవారం తహసీల్దార్ సుభాష్ చందర్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ కాలిపోయిన పత్తిని పరిశీలించారు. తహసీల్దార్ సిబ్బంది, ఏఈవో రాము పంచనామా నిర్వహించారు. నష్టాన్ని అంచనా వేశారు. వెంట శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కూలి ఎప్పుడిస్తరు?

- తీవ్ర ఇబ్బంది పడుతున్న కూలీలు
- ప్రస్తుతం కొనసాగని ఉపాధిహామీ పనులు



నర్సరీలో మొక్కల కోసం కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆయా ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఉపాధి కల్పించేందుకు ముందస్తుగా ప్రణాళికలను రూపొందించుకుంటారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా జీపీల్లో 11,318 జాబ్ కార్డులు ఉండగా.. 22,658 కూలీలు ఉన్నారు. ఇందులో 8,232 జాబ్ కార్డుల్లోని 15,447 మంది కూలీలు ప్రతీరోజు పనులకు వెళ్తున్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో 42 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. ఇదిలా ఉండగా ఆయా గ్రామపంచాయతీల్లోని కూలీలకు, మెటీరియల్ కోసం 2023– 24 ఆర్థిక సంవత్సరంలో రూ.9 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో కూలీలకు రూ.5.29 కోట్లు వెచ్చించారు.

సకాలంలో అందని కూలి డబ్బులు..

ఉపాధిహామీ కూలీలకు వారం వారం రావాల్సిన కూలి డబ్బులు సకాలంలో అందడం లేదు. నెలకు ఒకసారి అందిస్తుండడంతో కూలీలకు ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో వారానికోసారి డబ్బులు చెల్లించేవారని, ప్రస్తుతం నెలనెలా ఇస్తుండడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులకు బ్రేక్..

వ్యవసాయ పనులు ఉండడంతో కూలీలు అటువైపే మొగ్గు చూపుతున్నారు. ఉపాధిహామీ పథకంలో ప్రస్తుతం నర్సరీల్లో కొంత మంది కూలీలు మాత్రమే పనులకు వెళ్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం కవర్లలో మట్టి నింపడం, సీడింగ్ చేయడం వంటి పనులను మాత్రమే చేపడుతున్నారు.

నెలకోసారి చెల్లిస్తున్నారు

ప్రస్తుతం నేను నర్సరీలో మొక్కల పెంపకానికి సంబంధించి పనులు చేపడుతున్నాను. వారానికోసారి కూలి డబ్బులు అందడం లేదు. నెలకొకసారి రావడంతో ఆర్థికంగా కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సకాలంలో ప్రభుత్వం కూలి డబ్బులు అందేలా చూడాలి.

– అబ్బన్‌వేని స్వామి, కచ్‌కంటి, ఉపాధిహామీ కూలీ

15 రోజుకోసారి చెల్లిస్తాం

ఈ ఆర్థిక సంవత్సరంలో మెటీరియల్‌కు సంబంధించిన ఎలాంటి పనులు జరగలేదు. కూలి పనులు జరగగా వాటికి సంబంధించి మాత్రమే డబ్బులు చెల్లిస్తున్నాం. 15 నుంచి 20 రోజుల్లోగా వీటిని కూలీలకు అందజేస్తున్నాం. కూలి డబ్బుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగడం లేదు.

– జాకిర్ హుస్సేన్, ఈజీఎస్ ఏపీవో

విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. విద్యాశాఖ మంత్రిని ఇప్పటి వరకు నియమించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖకు మంత్రిని నియమించి, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఫుడ్‌పాయిజన్ ఘటనలను అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, కోరింగ రవీందర్, శంభు, మడావి రవి, ఆత్రం జ్యోతిరామ్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర హోంశాఖ మంత్రి క్షమాపణ చెప్పాలి'



అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని బాబాసాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామ్‌రాజ్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బుధవారం దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మసుద్, భవలే సత్యానంద్, షేక్ సుఫీయన్, మీర్జా జీలానిబేగ్, పరత్‌వాగ్ దత్త, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ఎదులాపురం: ఆటో కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు దళిత్ అన్నారు. ఈనెల 22న హైదరాబాదులో నిర్వహించనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో వర్కర్స్ యూనియన్ రెండో మహాసభల పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. పైగా పన్నుల రూపంలో ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలను కార్మికులు చెల్లిస్తున్నారన్నారు. డ్రైవర్లకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు వారిని విస్మరించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్కే షకీల్, కార్మికులు ఆకాష్, నరేశ్, నందు, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గుదురి ముత్యంరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: హైదరాబాద్ తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఐటీఐ పూర్తి చేసిన జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, లాబరేటరీ అసిస్టెంట్ మెకానిక్, ఎయిర్ కండిషనింగ్, మెకానిక్ మోటర్ వెహికల్, డ్రాఫ్ట్‌మెన్ పోస్టుల భర్తీకి విద్యార్థులు ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98664 35005 సంప్రదించాలన్నారు.

తేమ శాతంలో సడలింపు ఇవ్వాలి



పత్తిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ

బోథ్: చలికాలంలో పత్తిలో తేమ శాతం పెరుగుతుందని, సీసీఐ అధికారులు తేమ శాతాన్ని 20 శాతం వరకు సడలింపు ఇవ్వాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. బుధవారం పలు జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పత్తిని పరిశీలించారు. వెంట నాయకులు శ్రీధర్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, ప్రశాంత్, సురేశ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో సీఆర్టీలు

కడెం: పెండింగ్ వేతనాలు, క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లు నెరవేర్చాలని ఈనెల 16 నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు సమ్మె చేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో పాఠం చెప్పేవారు లేక విద్యార్థులు ఆటలు ఆడుతూ కనిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని సీఆర్టీలు కోరుతున్నారు. విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హమాలీ వర్కర్ల అరెస్ట్

ఖానాపూర్: పెంచిన సివిల్ సప్లయ్ హమాలీ కూలీల రేట్ల జీవోను విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా బుధవారం మండలంలోని హమాలీలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ పిలుపు మేరకు కార్మికులు వెళ్లకుండా పోలీసులు ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



యోగాసనాలు నేర్పిస్తున్న యోగిత

బోథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాలికలు)లో యోగా శిక్షకురాలు మునిగెల యోగిత బుధవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు , బోథ్ ఎంఈవో కుమ్మరి పోశెట్టి మాట్లాడుతూ.. యోగా నిత్య జీవితంలో ఒక భాగమన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు యోగాసనాలు చేయాలన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో గల నడింపల్లె గ్రామంలో బుధవారం పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు పిసుపాటి రేవంత్ శర్మ, గాడిచర్ల గౌతమశాస్త్రి, వామనభట్ల ఆదినారాయణశర్మ, సంతోష్, ప్రహల్లాద్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తు పరియజ్ఞకరణం, మంటప దేవతార్చనలు, జలాధివాసం, దాన్య, ఫల, ఘన్ప, షయ్యాదివాసములు, అధివాసాంగ హోమాలు, శాంతిపోష్టికాలు, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాలకు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్‌తో పాటు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్ గజానంద్

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించేందుకు చేపడుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖోడద్, తలమడుగు, సుంకిడి గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సర్వే ఇప్పటివరకు 80 శాతం వరకు పూర్తయిందన్నారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఎంపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతోంది. సిబ్బంది బోథ్, సొనాల మండలాల్లోని 33 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారు.



ధన్నూర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేశారు. ఒకరోజుకు కనీసం 20 లబ్ధిదారుల సర్వే చేయాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు అధికారులకు సహకరించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరేడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని రాజులతండా గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆహ్వాన పత్రిక అందించేందుకు వచ్చిన గ్రామస్తులు ఆలయం వద్ద చీకటి ఉందని తెలపడంతో స్పందించిన ఆయన వారం రోజుల్లోగా హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కపిల్ దేవ్, మౌలానా, కర్తార్, అశోక్, సంతోష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మహేందర్ జాదవ్

నేరడిగొండ: విద్యా సంస్థలు మూతబడడంతో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుందని గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధకులు సమ్మెలో ఉండడంతో పాఠశాలలు తెరవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన లైవ్ మండల అధ్యక్షుడు రాథోడ్ సందీప్, జిల్లా ఇన్‌చార్జి రాథోడ్ పాండు, బోథ్ ఇన్‌చార్జి ఆడే వసంత్‌రావు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టి నిరవధిక సమ్మెకు పీఆర్టీయూ తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా శాఖ మద్దతు తెలిపింది. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అభిమాన్, మోహన్‌సింగ్, నూర్‌సింగ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతుతో విద్యార్థుల ముఖాముఖి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్

- సేంద్రియ పంటల సాగుపై అవగాహన

కైలాస్‌నగర్: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రభుత్వ బీఎస్సీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్ అన్నారు. సేంద్రియ విధానంలో పంటలను సాగు చేస్తున్న జైనథ్ మండలం పార్డి (బి) గ్రామానికి చెందిన ఆదర్శ రైతు మంచాల గంభీర్‌తో కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ముఖాముఖి నిర్వహించారు. పేడ, వానపాములతో సేంద్రియ ఎరువులను తయారు చేసే విధానంపై సదరు రైతు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గత 14 ఏళ్లుగా సేంద్రియ విధానంలోనే వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న తన అనుభవాలను వివరించారు. సేంద్రియ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వ్యవసాయ కోర్సు చదివే విద్యార్థులు దానిపై అవగాహన పెంచుకోవడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలలో 26 రోజులు పని కల్పించాలి

బోథ్: ఎన్నో ఏళ్లుగా బీడీ పరిశ్రమపై ఆధార పడుతున్న మహిళలకు కంపెనీ యాజమాన్యం నెలలో 26 రోజులు పని కల్పించాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం బీడీ పరిశ్రమ ఖార్ఖానా వద్ద బీడీ కార్మికులు ఆందోళన చేపట్టారు. తమకు కేవలం గత సంవత్సర కాలం నుంచి నెలలో ఆరు నుంచి ఎనిమిది రోజుల పని మాత్రమే కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం ఆకును కార్మికులకు ఇస్తున్నారని, దీంతో నష్టపోతున్నామన్నారు. బీడీ పరిశ్రమపై ఆధారపడుతున్న తమకు జీవనం భారంగా మారిందన్నారు. తమకు కూలి పెంచి, డబ్బులు చేతికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీడీ సంఘం నాయకులు గోవర్ధన్, గోదావరి, బీడీ కార్మికులు పాల్గొన్నారు.